
క్లుప్తంగా

ఆకట్టుకున్న వాగ్గేయ కీర్తనలు



విజయవాడ కల్చరల్: లయ నాద కళా స్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణోత్సవాలు సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత కార్యక్రమాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో కేవీ కిషోర్, సంగీత విద్వాంసురాలు కుందుర్తి మాధవి, ఎం.కీర్తన వాగ్గేయకార కీర్తనలు మధురంగా ఆలపించారు. పి.జయతి, అరవింద్, కార్తికేయ ఆదినారాయణ వాద్య సహకారం అందించారు. సంగీత కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

భక్తిగా హరికథా ఉత్సవాలు



విజయవాడ కల్చరల్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160 జయంతి సందర్భంగా శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో నిర్వహిస్తున్న హరికథా ఉత్సవాలు భక్తిగా సాగుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో తిరుపతికి చెందిన ఎం.రాముడు శ్రీ రామ జననం, తాడేపల్లి గూడానికి చెందిన కె.శారద సీతా కల్యాణం, రామచంద్రాపురానికి చెందిన వై.శిఖామణి పాదుకా పట్టాభిషేకం రెండవ భాగం కథలను మధురంగా వినిపించారు. హరికథా భాగవతారిణి వై.శిఖామణికి నేతి లక్ష్మీనారాయణ స్మారక పురస్కారం ప్రదానం చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.శర్మ శుక్రవారం జరిమానా విధించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఒకటో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): కుమారుడి అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. వాంబేకాలనీకి చెందిన బిరకా లక్ష్మీ కుమారుడు శ్యామ్‌కుమార్ సూర్యారావుపేటలోకి కార్ సర్వీస్ సెంటర్లో పని చేస్తుంటాడు. ఈ నెల 28వ తేదీన పనికి వెళ్లిన తమ కుమారుడు తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

యోగాతో రుగ్మతలు మాయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఏపీ శాఖ ఆధ్వర్యంలో సహజయోగ ధ్యానంపై ఈ నెల 31, సెప్టెంబర్ ఒకటో తేదీ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఏపీ కోఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ చెప్పారు. ఏపీ దేవదాయ ధర్మదాయ శాఖ సహకారంతో విజయవాడ సీవీరెడ్డి చారిటీస్ ప్రాంగణంలో ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం సహజయోగ సాధన ద్వారా మనిషి శారీరక, మానసిక రుగ్మతలను మాయం చేసుకోవచ్చని తెలిపారు. సహజయోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇంటింటికీ సహజయోగం వ్యాప్తి కోసం పలు కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. సహజయోగ ప్రక్రియల ద్వారానూ, ధ్యానం చేయటం ద్వారా ప్రతి ఒక్కరూ తమలో వివేకం, విజ్ఞానం, సత్వగుణాలను పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. స్కిల్స్, నాలెడ్జ్, డిజైర్ లక్ష్యంగా ఈ వర్క్‌షాపు ఉంటుందన్నారు. ఐటీ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిపుణులను తయారుచేస్తున్న ఢిల్లీకి చెందిన యోగేష్ అగర్వాల్, కాన్పూర్‌కు చెందిన రాజేష్‌చంద్ర సహజయోగాపై తరగతులు నిర్వహిస్తారని వివరించారు. ట్రస్ట్ దక్షిణ భారత కోఆర్డినేటర్ సుభాషిణి, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సహజయోగ ధ్యాన కేంద్రం వివిధ విభాగాల్లోని ప్రతినిధులు, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సహజయోగ ధ్యాన కేంద్రం నిపుణులు హాజరవుతున్నారని వెల్లడించారు. ప్రారంభసభకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కేఎస్ రామారావు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారన్నారు. ట్రస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యులు పీవీ రామ్మోహనరావు, మహిళా విభాగం కోఆర్డినేటర్ సుగ్గుల సుధారాణి, ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, విజయవాడ కోఆర్డినేటర్ టి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో భద్రత చర్యలు ముఖ్యం



ప్రజల ఆరోగ్యమే పరమావధిగా సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి భద్రత, భరోసా కల్పించాలి. ప్రతి ఆసుపత్రిలో ప్రత్యేక భద్రత చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా మహిళల కోసం అవసరమైన సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిని తక్షణమే కఠినంగా శిక్షించాలి. కోల్‌కత్తా వంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలి.

డాక్టర్ వి.హనుమంత ప్రసాద్, రిటైర్డ్ అడిషనల్ డీఎంహెచ్ఓ



వైద్యులపై దాడులు విచారకరం

వైద్యులు, వైద్య సిబ్బందిపై తరచూ దాడులు చేయడం విచారకరం. దాడులు జరిగిన తరువాత తీసుకునే చర్యలు కన్నా నివారణ కోసం తీసుకునే జాగ్రత్తలు మంచిది. నైట్ డ్యూటీ చేసే సిబ్బందికి పటిష్ట భద్రత కల్పించాలి. చట్టాలను సమర్థవంతంగా అమలుచేయాలి. నేరం చేసిన వారికి శిక్ష తప్పదు అనే విధంగా పని చేయాలి.

–డాక్టర్ ఎం.ప్రభుదాస్. ఫిజియోథెరపిస్టు



వాడ వాడలా వనం.. మనం



29వ డివిజన్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి తదితరులు



కడియాల వారి వీధిలో మొక్కలు నాటుతున్న కార్పోరేటర్ కుక్కల అనిత



మొక్కను నాటుతున్న కార్పొరేటర్ వై.తిరుపతమ్మ



బెత్లెహేంనగర్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ నిర్మలకుమారి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో శుక్రవారం నగర పాలక సంస్థ ఆధ్వర్యాన వనం..మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక సంస్థ సిబ్బంది, వార్డు సచివాలయం సిబ్బంది కార్పొరేటర్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతను వివరించారు. 26వ డివిజన్ మధురానగర్‌లో కార్పొరేటర్ కొంగిత లక్ష్మీపతి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. 27వ డివిజన్ దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి మొక్కలు నాటారు. మొక్కలు నాటి సంరక్షిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. 28వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో జరిగిన వనం మనం కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచనేని లలిత ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని అన్నారు. 30వ డివిజన్ ముత్యాలంపాడులో కార్పొరేటర్ పెనుమత్స శిరష సత్యం పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు పెంచటం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు మొక్కలు నాటారు. నేడు పెరిగిపోతున్న కాలుష్యంను అదుపు చేయాలంటే మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు.



27వ డివిజన్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి తదితరులు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

పాయకాపురం(విజయవాడరూరల్): మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచడం వలన పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తాయని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ అన్నారు. వనం మనం కార్యక్రమంలో శుక్రవారం బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతమ్మ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గారావు, ఉపాధ్యాయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకోసం మొక్కలు నాటి పోషిద్దామని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆమె శుక్రవారం డివిజన్‌లోని కడియాల వారి వీధిలో సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య కోరల నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానికులు కుక్కల రమేష్, కొమ్ము చంటి తదితరులు పాల్గొన్నారు.

జమున నవరస నటి



విజయవాడ కల్చరల్: కళాభారతి జమున కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం 88 జయంతి నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు గద్దం లక్ష్మణరావు మాట్లాడుతూ జమున నవరస నటి అభివర్ణించారు. సినీ నటిగా, ప్రజాస్వామ్యవాదిగా రాజకీయ నాయకురాలిగా విశేషమైన కీర్తిని గడించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వై.రాంబాబు, సురేంద్ర, గోవింద్, లంకా రాంబాబు, గ్రంధి రవి పాల్గొన్నారు. నిర్వాహకులు పేదలకు ఆహార పొట్లాలు, బాల బాలికలకు పండ్లు పంపిణీ చేశారు. నిర్వాహకులు జమున చిత్ర పటానికి నివాళులర్పించారు.

కిడ్నీ బాధితులకు రూ.10 వేలు పింఛను ఇవ్వాలి

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎ. కొండూరు ప్రాంతంలో కిడ్నీ బాధితులందరికీ డయాలసిస్‌తో సంబంధం లేకుండా నెలకు రూ. 10 వేలు పింఛను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమాన్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ వ్యాధితో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒక హెక్టార్ భూమి, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కిడ్నీ బాధితులకు పౌష్టికాహారం అందించాలని, డయాలసిస్ సెంటర్లలో అనుభవజ్ఞులైన వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏర్పాటుచేసి గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎ.కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్ పాల్గొన్నారు.

స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు తాము కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మేయర్ అధ్యక్షత స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. 21 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 14 ఆమోదిస్తూ తీర్మానించారు. నాలుగు అంశాలు వాయిదా వేయగా, ఒక అంశాన్ని రికార్డు, ఒక అంశాన్ని ధ్రువీకరించారు. ఒక అంశాన్ని తర్వాత జరిగే సమావేశంలో పూర్తి వివరాలతో పొందుపరచాలని నిర్ణయించారు.

ప్రధానాంశాలు.....


- సింగ్‌నగర్ నందమూరి నగర్‌లో నిర్మించిన వాటర్‌ట్యాంకు ప్రాంగణానికి ప్రహరీ నిర్మించాలని అందుకు అయ్యే రూ. 33 లక్షలు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి వెచ్చించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.



స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి

- కెనాల్ రోడ్డు పార్కింగ్ ప్రదేశాన్ని ఏడాదిపాటు లీజుకు సీల్డ్ టెండర్లు పిలవగా మైలవరపు దీపక్ కుమార్ అధిక మొత్తంలో రూ.32లక్షలకు టెండరు దక్కించుకున్నారని దీన్ని స్థాయీ సంఘం ఆమోదించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు.
- లబ్బీపేట బృందావన కాలనీలోని వీఎంసీ ఇంజినీర్ బంగ్లాను అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫీస్‌కు లీజుకు ఇవ్వాలని, ఇందుకు నెలకు రూ. 23 వేల నెలవారీ అద్దె చెల్లించేలా వచ్చిన ప్రతిపాదనను స్థాయీ సంఘం ఆమోదిస్తూ తీర్మానం చేసింది
- సర్కిల్-3 పరిధిలోని రాణిగారితోటలో ఉన్న రివర్ ఫ్రంట్ పార్కుకు, అజిత్‌సింగ్ నగర్ ఆర్‌ఆర్‌ఆర్ (రీసైకిల్, రీయూస్, రెడ్యూస్) పార్కుల ప్రవేశ రుసుం పెద్దలకు రూ. 20, చిన్నారులకు రూ.10, వాహనాల పార్కింగ్‌లో కారుకు రూ. 50, ద్విచక్రవాహనానికి రూ. 20, కెమెరాకు రూ. 20, వీడియోకు రూ. 100, టీవీ సీరియల్ షూటింగ్‌కు ఒక్కరోజుకు రూ. 5 వేలు, వీడియో షూటింగ్ పెళ్లి, పుట్టినరోజు వేడుకలకు రూ. 1000, సినిమా షూటింగ్ రూ.10 వేలుగా నిర్ధారించారు. స్కూల్ పిల్లలకు 50 శాతం కన్సెషన్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 75 శాతం కన్సెషన్ ఇచ్చేలా వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే వాకర్స్‌కు, యోగా చేసేకునేవారికి ఉదయం 5.30 నుంచి 8.30 గంటల వరకు నెలకు రూ.300, కారుకు పార్కింగ్ నెలకు రూ. 1000, ద్విచక్రవాహనానికి రూ. నెలకు రూ. 500 చెల్లించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



మధురానగర్ నేతాజీ కాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు



శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రావణమాసం చివరి శుక్రవారం కావటంతో దేవాలయాల్లో శ్రావణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు చేశారు. అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠం, ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, మధురానగర్ అంకమ్మతల్లి శక్తిపీఠం, దావు బుచ్చయ్యకాలనీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయం, ముత్యాలంపాడు షిరిడీ సాయిబబా మందిరంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు దేవాలయాలకు చేరుకుని పూజలు చేశారు.

పారాయణాలతో సర్వపాప హరణం



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న హజరత్తయ్య గుప్తా, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీవిష్ణు, లలిత సహస్రనామ పారాయణం చేసిన వారికి సర్వ పాపములు తొలగి, అశుభములు, జన్మ మృత్యు జరావ్యాధి భయాలు ఉండవని, సుఖం, శాంతి, సిరి, ధైర్యము, కీర్తి లభించి పుణ్యాత్ములు అవుతారని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రీవిష్ణు, లలిత సహస్రనామం, హనుమాన్ చాలీసా ప్రాశస్త్యంపై ఆయన ప్రవచనం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ శ్రీ విష్ణుసహస్రనామం, లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం ప్రాధాన్యం ప్రతి ఒక్కరికీ తెలియ చేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. అమ్మ వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమాలను మారం రోజా, జేవీవీ రెడ్డి, మందలపర్తి సత్య శ్రీహరి పర్యవేక్షించారు.

సినీ రంగ విశేషాలపై అవగాహన పెంచుకోవాలి



గ్రంథావిష్కరణ సభలో డాక్టర్ అశోక్ తేజా, కలిమిశ్రీ, డాక్టర్ ప్రభాకర్ తదితరులు



శ్రమ కావ్యం కవితాగానం చేస్తున్న అశోక్‌తేజ

సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

విజయవాడ కల్చరల్: సినీ రంగ విశేషాలపై నేటి తరం యువతీ యువకులు అవగాహన పెంచుకోవాలని సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. డాక్టర్ ఎం.ప్రభాకర్ రచించిన రాగం తానం పల్లవి సినీ రంగ విశేషాలు కలిగిన గ్రంథాన్ని ఆయన ఓ హోటల్లో శుక్రవారం ఆవిష్కరించారు. అశోక్‌తేజ మాట్లాడుతూ గ్రంథంలో సినీ గేయ రచయితలు, గాయనీ గాయనీ గాయకులు జీవిత విశేషాలను వివరించినట్లు తెలిపారు. మల్లెతీగ సాహిత్యవేదిక వ్యవస్థాపకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ డాక్టర్ ప్రభాకర్ సామాజిక స్పృహ కలిగిన రచయితగా అభివర్ణించారు. రచయిత డాక్టర్ ప్రభాకర్, కళాపోషకుడు మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. జాషువా కళావేదిక ఆధ్వర్యంలో బందరురోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సినీ గేయ రచయిత, జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ అశోక్ తేజ రచించిన శ్రమ కావ్యం స్వీయ గానం చేశారు. కార్మికులు కర్షకులు, రైతు కూలీల కడగండ్లు కావ్యంలో ప్రస్తావించినట్లు తెలిపారు. జాషువా కళావేదిక బాధ్యుడు సునీల్‌కుమార్, ఎంబీకే విజ్ఞాన కేంద్రం మురళీకృష్ణ పాల్గొన్నారు. సాహితీవేత్తలు గోళ్ళ నారాయణరావు, డాక్టర్ జయప్రకాష్ పాల్గొన్నారు.

తెలివైన వారే సైబర్ నేరాలకు బలి



సీపీ రాజశేఖరబాబును సన్మానించి లక్ష్మీదేవి చిత్రపటాన్ని బహూకరిస్తున్న బీబీఏ ప్రతినిధులు

విజయవాడస్పోర్ట్స్: ఎంతటి తెలివైన వారినైనా బురిడీ కొట్టించగల మేథోశక్తితో సైబర్ నేరగాళ్లు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ), ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు బీబీఏ సమావేశపు మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులను సైతం మోసం చేసే స్థాయి సైబర్ నేరగాళ్లు చేరుకున్నారని తెలిపారు. అత్యాశకు పోయిన వ్యక్తులే అత్యధికంగా సైబర్ నేరగాళ్లకు చిక్కుతున్నారన్నారు. చేతిలోని మొబైల్‌ను చాలా జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. బీబీఏ అధ్యక్ష కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్ (రాజా) అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీఐలు కోమాకుల శివాజీ, గుణరామ్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్, సురాబత్తుల దుర్గామల్లేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం సీపీ రాజశేఖరబాబును బీబీఏ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి లక్ష్మీదేవి పటాన్ని బహూకరించారు.